ప్రజాశక్తి
శుక్రవారం 21 నవంబరు, 2025
5
శ్రీకాకుళం




దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళంలోని బలగ ప్రభుత్వ ఐటిఐ (డిఎల్‌టిసి)లోని స్కిల్ హబ్‌లో స్వల్పకాళిక శిక్షణలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌసిల్ వికాస్ యోజనలో భాగంగా ఈ శిక్షణలు ఇస్తున్నట్లు చెప్పారు. మూడు నెలల కోర్సు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్‌కు పదో తరగతి ఉత్తీర్ణత, 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారు అర్హులుగా చెప్పారు. సైబర్ సెక్యూరిటీ అండ్ సోషల్ మీడియా ఎనలైస్ట్ మూడు నెలల శిక్షణకు ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లమా అర్హత కాగా, 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు వారు అర్హులుగా చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 7095731303 ఫోన్ నంబరును సప్రదించాలన్నారు.

'కౌలు'కు మొండిచేయి

● 'అన్నదాత' రెండో విడతలో సాయం అందిస్తామని ప్రకటన
● అమలు చేయని ప్రభుత్వం ● నిరాశలో రైతులు



కౌలు రైతుల విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వం కనీసం కనికరించడం లేదు. విత్తనాల నుంచి ధాన్యం అమ్ముకోవడం వరకు నానావస్థలు పడుతున్నా జాలిచూపడం లేదు. ఇదిగో అదిగో అన్నదాత సుఖీభవ పథకం కింద సాయం అందిస్తామంటూ చెప్పిన్న ప్రభుత్వం రెండో విడత సమయంలోనూ వారికి డబ్బులు జమ చేయలేదు. అన్నదాత సుఖీభవ తొలి విడత సాయం అందిస్తున్న సందర్భంలో రెండో విడతలో కౌలు రైతులకు డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కౌలు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో వారికి ప్రస్తుతం ఇవ్వలేకపోతున్నామని తెలిపింది. ఇప్పుడు వారి చేతికి కార్డులు ఇచ్చినా డబ్బులు జమ చేయకపోవడంతో వారంతా తీవ్ర నిరాశ నిస్పృహలో ఉన్నారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల పంటలు కలిపి సుమారు 4,47,383 ఎకరాల విస్తీర్ణం మేర సాధారణ సాగుగా ఉంది. ప్రస్తుత ఖరీఫ్‌లో 4,53,973 ఎకరాల్లో రైతులతో పంటలు వేసేలా లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. అందులో ప్రధాన పంట వరిని 4,07,500 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో దాదాపు 2 లక్షల ఎకరాల పైన కౌలు రైతులే సాగుచేస్తున్నారు. జిల్లాలో సుమారు లక్ష మందికి పైగా కౌలు రైతులు ఉంటారని ఒక అంచనాగా ఉంది. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 9,800 లక్షల మంది కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ప్రభుత్వం జూన్ రెండో వారంలో కౌలు రైతులకు కార్డుల జారీ ప్రక్రియను మొదలు పెట్టింది. ఇప్పటివరకు మొత్తం 7,937 మందికి జారీ చేశారు.

కౌలు కార్డుల జారీలో జాప్యం

కౌలు గుర్తింపు కార్డుల జారీలో జరిగిన జాప్యం కూడా అన్నదాత సుఖీభవ పథకానికి కౌలు రైతులు దూరమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులను గుర్తించి, సిసిఆర్‌సి కార్డుల జారీని సులభతరం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన పంట సాగు హక్కుదారుల చట్టం-2019 నే యథాతథంగా అమలు చేసింది. దీంతో భూ యజమానుల దయాదాక్షిణ్యంపైనే కార్డుల జారీ ప్రక్రియ సాగింది. తమ భూమిపై భవిష్యత్‌లో కోర్టులకు వెళ్తారన్న భయం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు తమకు రావనే ఉద్దేశంతో చాలాచోట్ల అంగీకార పత్రాలపై సంతకాలు చేసేందుకు భూయజమానులు అంగీకరించలేదు. ఒకట్రెండు ఎకరాల భూమి ఉన్నవారు స్థానిక రైతులకు కౌలుకి ఇచ్చి చాలా మంది వలస వెళ్లిపోతున్నారు. ఆధార్ కార్డు, పాస్‌పుస్తకం కాపీలు ఇవ్వడానికి, రాతపూర్వక సమ్మతి తెలపడానికి వారు రావడానికి ఇష్టపడలేదు.

రైతు భరోసా దక్కినా... అన్నదాత సుఖీభవకు దూరం

గత ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని కౌలు రైతులకు వర్తింప చేసినా ప్రస్తుత కూటమి ప్రభుత్వం వారిని పరిగణనలోని తీసుకోలేదు. కార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాలేదనే సాకుతో వారిని పథకానికి దూరంగా ఉంచింది. దీంతో కౌలు రైతులు అన్నదాత సుఖీభవకు నోచుకోలేని పరిస్థితి నెలకొంది. కౌలు కార్డులు దక్కినా దాని ఫలితం మాత్రం కౌలు రైతులు పొందలేకపోతున్నారు. విత్తనాల పంపిణీ దాదాపు పూర్తయిన తర్వాత కార్డులు ఇవ్వడం ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో పాటు కార్డు పొందిన రైతులకు బ్యాంకు రుణాలూ దక్కడం లేదు. భూ యజమానులు అప్పటికే ఆ భూమిపై రుణం తీసుకోవడంతో బ్యాంకర్లు వారికి రుణం మంజూరు చేయడం లేదు.

ముగిసిన పుస్తక మహోత్సవం

సిక్కోలు పుస్తక మహోత్సవం ఈ నెల 11న ప్రారంభమై గురువారంతో ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వందకు పైగా పుస్తకాలు ప్రచురించారు. వేలాది పుస్తకాల ప్రదర్శనతో పాటు అమ్మకాలు జోరుగా సాగాయి. ఈ పది రోజుల పాటు సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాలు ఆధ్యాంతం ఆకట్టుకున్నాయి. విజ్ఞానం, వినోదం మేళవించాయి. పలు ప్రచురణ సంస్థలు ఏర్పాటు చేసిన లక్ష పుస్తకాలను చూసి పుస్తక ప్రియుల మనసు పులకించింది. సాహిత్య సభలు, కవి సమ్మేళనాలు సాహిత్య ప్రియులను ఓలలాడించాయి. చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా జనవిజ్ఞాన వేదిక ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగాలు అందరినీ ఆలోచింపచేశాయి. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టెలీ స్కోప్‌లో నుంచి నక్షత్రాలను చూసేందుకు చిన్నారులు పోటీపడ్డారు. సిక్కోలు పుస్తక మహోత్సవానికి పుస్తక ప్రియులు, సాహిత్య అభిమానుల నుంచి అనూహ్య స్పందన లభించింది.

ప్రజాశక్తి- అరసవల్లి

నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన సిక్కోలు పుస్తక మహోత్సవ కార్యక్రమం గురువారంతో ముగిసింది. కాళీపట్నం రామారావు సాహిత్య వేదికలో కాళింగాంధ్ర యాస-భాష అంశంపై రచయిత నెట్టి రమణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఆంధ్రా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న తెలుగు భాషాభివృద్ధి గిడుగు రామ్మూర్తి పంతులు ఆద్యుడని కొనియాడారు. గురజాడ ఆధునిక భాషాబివృద్ధికి కృషి చేశారని తెలిపారు. రచయిత బండి సత్యనారాయణ మాట్లాడుతూ మాండలిక భాషాప్రాంతాలు ఉన్నాయని అన్నారు. యాసకు, భాషకు తేడా ఉందని పేర్కొన్నారు. తెలుగు భాషలో ప్రాంతల వారిగా యాస ఉంటుందని అన్నారు. చాసో, రావిశాస్త్రి కథలు, మాండలీకంలో కాళింగాంధ్ర రచనలలో పొందుపర్చారని అన్నారు. రచయిత డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి జిల్లాకూ ఒకొక్క రకమైన యాస ఉందని అన్నారు. కొండగాలి, అడవి అంటుకుంది పుస్తకాలు రచనలో భూషణం మాస్టారు అద్భుతంగా కాళింగసీంలో ఉత్తరాంధ్ర యాసలో చక్కటి రచనలు చేశారని అన్నారు. కె.ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ పుస్తక మహోత్సవం ఏర్పాటు వల్ల పుస్తక ప్రియులకు నైతిక విలువలు కల్పించారని అన్నారు. రచయిత ఎన్.రమణ మాట్లాడుతూ సిక్కోలు యాస భాష ఎంతో మధురమైందని అన్నారు. అనంతరం రచయిత ఎల్.ఎన్.కొల్లి రచించిన 'ఎకోస్-ఎంబర్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత పత్తి సుమతి రచించిన డౌన్ డౌన్ డార్విన్ ఆట పుస్తకం ఆవిష్కరణ చేశారు. రచయిత మొయిద శ్రీనివాసరావు రచించిన కరవాక పుస్తకాన్ని ఆవిష్కరణ చేశారు. వీటిని బాలకృష్ణ పరిచయం చేశారు. రెడ్డి రామకృష్ణ, సాంబమూర్తి, చింత అప్పలనాయుడు, పూర్ణచంద్రరావు, చినసూర్యనారాయణ, సాయిమూర్తి, వాడాడ శ్రీనివాసరావు, పేర్రాజు, కె.వెంకట్, చెల్లూరు నారాయణ, సురేష్ కవి సమ్మేళణంలో పాల్గొన్నారు. జెవివి ఆధ్వర్యాన సైన్స్ వైజ్ఞానిక కార్యక్రమాలు కుప్పిలి కామేశ్వరరావు, గిరిధర్ ఆధ్వర్యాన నిర్వహించారు. మన్మథరావు, వి.ఎస్.కుమార్‌లు మూఢ నమ్మకాలు-శాస్త్రీయతపై అవగాహన కల్పించారు. వెంకటరావు సైన్స్ ప్రాజెక్టును వివరించారు. షణ్ముఖరావు ఆధ్వర్యాన సాంస్కృతిక కార్యక్రమాలు బ్రహ్మ సమాజం స్కిట్ నిర్వహించారు. డ్రగ్స్ వద్దు బ్రో ఒగ్గు కథ స్కిట్ నిర్వహించారు.. హేమసూదన్ బృందం ఆధ్వర్యాన డప్పు వాయిద్యం అందరినీ అలరించింది.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు


పుస్తకాలను తిలకిస్తున్న విద్యార్థినులు


అలరించిన డప్పు వాయిద్యం

విద్యార్థుల తాకిడి

ఎన్‌టిఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన సిక్కోలు పుస్తక మహోత్సవం నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన ముగింపు సందర్భంగా 150 మంది విద్యార్థులు సందర్శించారు. వీరంతా నగరంలోని సెంట్ డ్యూస్ పాఠశాల నుంచి విద్యార్థులు వచ్చి పుస్తక ప్రదర్శనను తిలకించారు. వీరిని ప్రిన్సిపాల్ సిస్టర్ జోష్ తీసుకొచ్చారు. విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలను కొనుగోలు చేశారు. అలాగే ప్రిన్సిపాల్ సిస్టర్ జోష్ కూడా పుస్తకాలను కొనుగోలు చేశారు.

ఉత్సాహంగా డ్రాయింగ్ పోటీలు

సిక్కోలు పుస్తకాల మహోత్సవంలో సిక్కోలు కమిటీ ఆధ్వర్యాన విద్యార్థులకు పుస్తకం మహోత్సవం సందర్భంగా డ్రాయింగ్ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను సిక్కోలు పుస్తక మహోత్సవ కమిటీ కన్వీనర్ కె.శ్రీనివాసు పరిశీలించారు.


పరిశీలిస్తున్న శ్రీనివాసు


వేణుగోపాలరావు

ఎపిసిగా వేణుగోపాలరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ (ఎపిసి)గా పప్పల వేణుగోపాలరావు నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల ఎపిసిలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం జిఒ నంబరు 304ను వెలువరించింది. ఇప్పటివరకు ఎపిసిగా పనిచేస్తున్న శశిభూషణ్‌ను యథావిధిగా ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల అధ్యాపకునిగా వెనక్కి పంపింది. బదిలీపై జిల్లాకు ఎపిసిగా వస్తున్న వేణుగోపాలరావు ప్రస్తుతం కాకినాడ ఎపిసిగా, స్పెషల్ ఎకనామిక్ జోన్ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్నారు. గతంలో పాతపట్నంతో పలు మండలాల్లో తహశీల్దార్‌గా పని చేసి డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగోన్నతి పొందారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన్ను కాకినాడ ఎపిసిగా ప్రభుత్వం నియమించింది. వేణుగోపాలరావు ఎచ్చెర్ల మండలం కొత్తపేటకు చెందిన రైతు కుటుంబంలో జన్మించారు. తొలుత స్కూల్ అసిస్టెంట్ ఎంపికయ్యారు. ఉపాధ్యాయునిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ... రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలిచి తహశీల్దార్‌గా ఎంపికయ్యారు.

జనవరి 29న ఢిల్లీలో ధర్నా

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఉపాధ్యాయులకు టెట్‌కు వ్యతిరేకంగా జనవరి 29న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ అన్నారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ప్రభుత్వం అన్ని మేనేజ్‌మెంట్ల వారికీ టెట్ క్వాలిఫై అవ్వాలనడం ప్రభుత్వ నిర్ణయమైనా, 2010 కంటే ముందు సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపులు ఇవ్వకపోవడం ఇబ్బందికరమని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి టెట్ నుంచి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయాలన్నారు. విద్యారంగం ప్రయోగాలకు నిలయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై పరీక్షల భారం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక నుంచి సెలవులు ఆదివారాలు మినహాయింపు నివ్వాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎల చెల్లించాలన్నారు. తక్షణమే పిఆర్‌సిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి, యూనియన్ నాయకులు వైకుంతరావు, కె.దాలయ్య, బి.ధనలక్ష్మి, బి.రవికుమార్, ఆఫీస్ బేరర్స్ జి.సురేష్, పి.సూర్య ప్రకాష్, జి.శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాద్

రథసప్తమికి పక్కా ఏర్పాట్లు

● ఉత్సవాలకు పకడ్బందీ బందోబస్తు
● ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రథసప్తమికి పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆలయంలో గురువారం రథసప్తమి ఏర్పాట్లపై గురువారం సమీక్షించారు. ఈ మాట్లాడుతూ వేడుకలు ఎలాంటి అంతరాయం లేకుండా, యాత్రికులకు అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. భక్తజన సందోహం, వాహనాల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ డైవర్షన్లు, పార్కింగ్ స్థలాలు, క్యూలైన్ల ఏర్పాటు, అత్యవసర ఆరోగ్య బృందాలు, అగ్నిమాపక సిబ్బంది వంటి అన్ని విభాగాల సన్నద్ధతను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. యాత్రికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా ప్రజలకు అత్యంత ముఖ్యమైన ఈ ఉత్సవంలో యాత్రికులకు పూర్తి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నీరు, శానిటేషన్, విశ్రాంతి గదులు, వైద్య సేవలు, ప్రకటనా వ్యవస్థ వంటి శాశ్వత, తాత్కాలిక సదుపాయాలను మెరుగుపరచాలన్నారు. ఏ శాఖలోనూ నిర్లక్ష్యం లేకుండా తమ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. సిసి కెమెరాలతో పర్యవేక్షణ, డ్రోన్ కెమెరాల ద్వారా జనసందోహంపై నిఘా వంటి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక 'షీ టీమ్స్', పిల్లల సహాయ కేంద్రాలు (చైల్డ్ హెల్ప్ బూత్స్) ఏర్పాటు చేయాలని కూడా ఎస్‌పి నిర్వాహకులకు ఆదేశించారు. ఆలయం ఇఒ జి.వి.ప్రసాద్ మాట్లాడుతూ రథసప్తమి రోజున లక్షల్లో యాత్రికులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. అందుకు అనుగుణంగా క్యూలైన్ షెల్టర్లు, తాగునీటి సదుపాయాలు, వైద్య సేవలు, పార్కింగ్ ప్రాంతాలు, స్నాన ఘాట్లు, శానిటేషన్ ఏర్పాట్లను విస్తృతంగా చేస్తున్నామని తెలిపారు. తాగునీటి బండ్లు, అంబులెన్స్‌లు, హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

వికలాంగుల సేవలో...

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మానసిక వికలాంగులకు మనోబంధు ఫౌండేషన్ మెరుగైన సేవలు అందిస్తుందని కలెక్టర్ స్వప్నిల్ దింకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్‌పి కె.వి. మహేశ్వర రెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ చేతుల మీదుగా మనోబంధు, ఇండియన్ సొసైటీ రాష్ట్రశాఖ రూపొందించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం మానసిక రోగులను తరలించే అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభించారు. మానసిక వికలాంగుల సేవలో మనోబంధు ఫౌండేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీతో కలిసి ముందడుగు వేశారని అన్నారు. జిల్లాలో మానసిక రోగులను గుర్తించి వారికి అవసరమైన సేవలు అందించడంలో కీలకంగా వ్యవహరించాలని సూచించారు. సమాజంలోని అత్యంత అవసరమైన మానసిక వికలాంగులకు అండగా నిలవడం అభినందనీయం అన్నారు. మానసిక వికలాంగుల పునరావాసం కోసం ప్రభుత్వం, పోలీసుశాఖ, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ వాలంటీర్ల ద్వారా మానసిక రోగులను గుర్తించి వారికి సరైన వైద్యం అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మనోబంధు ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ బీన ఢిల్లీరావు, రాష్ట్ర సూపర్‌వైజర్లు బాల సురేష్, ఎం.కళ్యాణ్‌చక్రవర్తి, పెంకి చైతన్యకుమార్, బి.చిన్మయరావు, కొల్లి సత్యనారాయణ, గొలివి రమణ, పిళ్ల సుధాకర్ పాల్గొన్నారు.


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జర్నలిస్టులు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

డిఐపిఆర్‌ఒ చెన్నకేశవరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అక్రిడిటేషన్ల కోసం జర్నలిస్టులు తమ పేపర్లు, ఛానల్స్ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కమ్మినాన చెన్నకేశవరావు తెలిపారు. సమాచార పౌర సంబంధాలశాఖ సంచాలకులు విజయవాడ నుంచి రాష్ట్రంలోని అందరు జిల్లా అధికారులతో గురువారం ఆయన జూం కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు చెప్పారు. పెద్ద పత్రికలు, శాటిలైట్ ఛానల్స్, ఎంపానెల్డ్ చిన్న పత్రికలకు సంబంధించి డాక్యుమెంట్లను సమాచార పౌర సంబంధాలశాఖ, విజయవాడ కార్యాలయంలో పేర్లను నమోదుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఎం.ప్యానల్ కానీ, చిన్న పత్రికలు సొంత రన్నింగ్ కేబుల్ కలిగి ఉన్న కేబుల్ నెట్‌వర్క్, జర్నలిస్టులు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వద్ద పత్రికలకు సంబంధించిన పత్రాలను, సాఫ్ట్ కాపీలు హార్డ్ కాపీలు అందజేసి నమోదు చేసుకోవాలన్నారు. https://mediarelations.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వివిఆర్‌ఎ సంఘం నాయకులు

వివిఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- బూర్జ

వివిఆర్‌ఎల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం వివిఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వివిఆర్‌ఎ మండల అధ్యక్షుడు గుండు రామ్మూర్తి ఆధ్వర్యంలో తహశీల్దార్ వై.వి.పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంతో సమానంగా వివిఆర్‌ఎలకు పేస్కేల్ అమలు చేయాలని, రాత్రి విధులను రద్దు చేయాలని కోరారు. అంతే కాకుండా డిఎను వారి జీతంలో విలీనం చేయడం, వారి నామినీలను వివిఆర్‌ఎలుగా నియమించాలని, వివిఆర్‌ఎ, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ వంటి ఖాళీ పోస్టుల్లో అర్హత గల వివిఆర్‌ఎలతో భర్తీ చేయాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.

కవిటి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వివిఆర్‌ఎలు తహశీల్దార్ బి.మురళీమోహనరావుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాళీ, జగదీష్, తెల్గేడు, పీతాంబర్, విజయ, లక్ష్మీ, మోహినమ్మ, పుష్పలత తదితరులున్నారు.



కార్యకర్తలకు మెటీరియల్‌ను అందజేస్తున్న సిడిపిఒ తదితరులు

అంగన్వాడీలను మోడల్ కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి- పొందూరు

ప్రతీ అంగన్వాడీ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా తీర్చిదిద్దేలా ఆయా కేంద్రాల కార్యకర్తలు కృషి చేయాలని సిడిపిఒ ఎం.వి.కె.సత్యశ్రీ అన్నారు. మండలంలోని లోలుగు ఉపహార్ కేంద్రంలో బెజ్జిపురం యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇండియా లిటరసీ ప్రాజెక్టు బెంగుళూరు సహకారంతో నిర్వహిస్తున్న స్కూల్ రెడీనెస్, బాలవికాస్ ప్రోగ్రాంలో గురువారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొందూరు, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల్లో పూర్వ ప్రాథమిక తరగతులను బోధిస్తున్న 63 అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలకు సిడిఎఫ్ మోడల్, బాలబడిపై రెండురోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సిడిపిఒ సత్యశ్రీ మాట్లాడుతూ శిక్షణలో రెండు రోజులుగా నేర్చుకున్న నైపుణ్యాలను ప్రతీఒక్కరూ కేంద్రాల్లో అమలు చేయడం ద్వారా పిల్లల నమోదును కూడా పెంచవచ్చునన్నారు. అనంతరం 63 అంగన్వాడీ కేంద్రాలకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎండిఎల్ఎస్ కో-ఆర్డినేటర్ టి.కరుణాకరరావు, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పి.మాదవి, సూపర్‌వైజర్ జి.సుజాత, ప్రాజెక్టు కమ్యూనిటీ ఆర్గనైజర్స్ వై.శంకరరావు, ఎ.రమణమూర్తి, కె.శ్రావణి, యు.మెహెర్‌వాణి, ఫెసిలిటేటర్ బి.సంతోషి, పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

26న నిరసన

పలాస: రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా ఈ నెల 26న నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని కార్మిక, రైతు సంఘాల ప్రతినిధులు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ప్రజా సంఘాల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు, సిపిఐ ఎం యల్ న్యూ డెమోక్రసీ, లిబరేషన్ నాయకులు ఎన్.గణపతి, వంకల మాధవరావు, మద్దిలి రామారావులు మాట్లాడుతూ కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు, రైతు వ్యతిరేక నల్ల చట్టాలు వల్ల కార్మికులు, రైతులు బానిసత్వంలోకి నెట్టబడ్డారని అన్నారు. ఈ చట్టాలు రద్దుకు గత నాలుగు ఏళ్లుగా అటు ఢిల్లీ కేంద్రంగా రైతులు, దేశ వ్యాప్తంగా కార్మికులు, రైతులు ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. 26న రైతులు ఢిల్లీ కేంద్రంగా పోరాటం ప్రారంభించిన సందర్భంగా నిరసనలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. కాశీబుగ్గ రైల్వే స్టేషన్ రోడ్ నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. కార్మికులు, రైతులు పాల్గొని ఈ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు టి.అజయ్ కుమార్, ఎన్.ఢిల్లేశ్వరి పాల్గొన్నారు.

గొలుసు వాహనాలతో అవస్థలు

ప్రజాశక్తి- బూర్జ

గొలుసు వాహనాలతో మండల ప్రజలకు అనునిత్యం అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా పాలకొండ- శ్రీకాకుళం ప్రధాన రహదారికి అనుకుని బూర్జ మండలంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేలాపాల లేకుండా ఒక్కసారిగా పదుల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో ప్రజలతో పాటు వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకేసారి పదుల సంఖ్యలో వాహనాలు వెళ్తు ఒడడంతో మరోవైపు వాహనాలకు దారిలేని పరిస్థితి ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా వరుసగా వాహనాలు రావడం వలన ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని మండల ప్రజలతో పాటు వాహనదారులు కోరుతున్నారు.



ఒకేసారి గొలుసుగా వెళ్తున్న వాహనాలు

పుస్తక పఠనంతోనే బంగారు భవిష్యత్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీకి గ్రంథాలయాలే మూలమని డా.బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం గ్రంథాలయ శాస్త్ర విభాగాధిపతి డా.దువ్వు చక్రపాణి అన్నారు. స్థానిక కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శివ శంకర్ మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావంతో యువతలో పుస్తక పఠనంపై క్రమేణా ఆసక్తి తగ్గిపోతోందన్నారు. కళాశాల లైబ్రేరియన్ పి.వై కమల్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న గొప్ప వ్యక్తులు గ్రంథాలయాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించారని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి చక్రపాణిని ఘనంగా సత్కరించారు.

బూర్జ: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, పుస్తకాల పఠనంతోనే విద్యార్థులు బంగారు భవిష్యత్‌కు తోడ్పాటు అవుతుందని ఎస్‌ఐ ప్రవళిక అన్నారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ఎంపిడిఒ తిరుపతిరావు, డిప్యూటీ ఎంపిడిఒ, శాఖా గ్రంథాలయాధికారి కె.సునీత, ఎంపిపి స్కూల్ హెచ్‌ఎం, సెక్రటరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

లావేరు: విద్యార్థులకు పఠన శక్తి అవసరమని, గ్రంథాలయంలో పుస్తకాలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఎంపిడిఒ పి.వెంకటరాజు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, హైస్కూల్ పీడీ జె. సుదర్శనరావు, లిటిల్ స్కూల్ ప్రిన్సిపాల్ బాలరాజు,



బూర్జ : మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రవళిక

శ్రీసత్యసాయి స్కూల్ ప్రిన్సిపాల్ కళ్యాణి, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

అరసవల్లి: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు చదివి విజ్ఞానవంతులు కావాలన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. నగర టిడిపి అధ్యక్షులు పాండ్రంకి శంకర్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఆదికేశవ కనకరాజు, ముట్టూరు ఫణీంద్ర శర్మ, సోడవరం ఈశ్వరరావు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వివిజిఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పివి భాస్కర్ రాజా, సిబ్బంది ప్రత్యూష, వరలక్ష్మి, గణేష్ పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మొబైల్‌ను వీడి పుస్తకం పట్టడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంపిడిఒ ఎం.పావని అన్నారు. గ్రంథాలయాధికారి కె.ఎర్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన ఉన్నత పాఠశాల సంకిలికోట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బి. రామారావు, మండల తెలుగుయువత అధ్యక్షులు ధవళ సింహాచలం, ఎస్‌ఎంసి అధ్యక్షులు ఇల్లాకుల ప్రభాకర్, సూర్య ప్రకాష్, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది విమల తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పుస్తక పఠనంతోనే విజ్ఞానాభివృద్ధి సాధ్యమని ఉద్యమ సంస్థ కన్వీనర్ బుడుమూరు సూర్యారావు అన్నారు. పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు



శ్రీకాకుళం ప్రతినిధి : బహుమతులు అందజేస్తున్న చక్రపాణి

కార్యక్రమం చేపట్టారు. క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయాధికారి అన్నెపు కోటేశ్వరరావు, రోటరీ క్లబ్ చైర్మన్ వి.విటోదర్, క్లబ్ డైరెక్టర్ విజయలక్ష్మి, రిటైర్డ్ హెచ్‌ఎం సూర్యారావు, సూర్యనారాయణ పైడిభాని పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గ్రంథాలయ అధికారి ఆర్.అనూరాధ ఆధ్వర్యాన నిర్వహించారు. ఎంపిడిఒ నరసింహ ప్రసాద్‌పండా, ఎంఇఒ ఎస్.దేవేందరరావు, ఎస్‌ఐ పి.రమేష్‌బాబు పాల్గొన్నారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, రంగవల్లికలు, కవితల వంటి పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల మేధో వికాసానికి అపారంగా దోహదపడతాయన్నారు. పాఠ్యపుస్తకాలే కాకుండా అన్నిరకాల జ్ఞానవర్ధక గ్రంథాలు లభి స్తాయని తెలిపారు. నందవా స్కూల్ ప్రిన్సిపాల్ జె.జె. ప్రతాప్ ప్రియాంక, గణేష్, సహాయకులు హేమలత పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి టి.ఇందిరా ఆధ్వర్యాన నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్.గోవిందరావు, ఎంపిటిసి ప్రతినిధి టి.తిరుపతిరావులు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు, ఉపాధ్యాయుల రామచంద్రరావు పాల్గొన్నారు.

నందిగాం: స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యాన నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఎంఇఒ జి.నరసింహులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొన్ని జయరామ్, మట్ట భావనకుమార్, శివరాంపురం సర్పంచ్ జానకిరామ్, ప్రధానోపాధ్యాయులు కె.హేమావతి, ఉపాధ్యాయులు శంకరరావు, పొట్నురావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పోలాకి: గ్రంథాలయ వారోత్సవాలు ముగింపులో భాగంగా గ్రంథాలయ అధికారి కింజరాపు మానస ఆధ్వర్యాన పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గులు, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన ముఖ్య అతిథి తాడి ఎర్రయ్య బహుమతులను అందజేశారు. సర్పంచ్ మజ్జి రమణమ్మ, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు శశి కుమార్, వై.పాలక్షయ్య పాల్గొన్నారు.

టెక్కలి : ప్రస్తుతం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని తహశీల్దార్ ఎం.సత్యం అభిప్రాయపడ్డారు. గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సమావేశంలో పాల్గొన్నారు. వివిధ రకాల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి బి.రాపావతి ఆధ్వర్యాన ఉపాధ్యాయులు సోమరాజు, రవికుమార్, సంబాల వాణిశ్రీ, స్మార్తి, వివేకాల గ్రంథాలయాధికారి గున్నప్రసాద్, నాగభూషణం, అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను పిఎసిఎస్ అధ్యక్షులు కూచెట్టి కాంతారావు, ఎంఇఒ అర్జునుడు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రామకృష్ణ, టిడిపి యూత్ అధ్యక్షులు కూచెట్టి భానుప్రకాశ్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

నౌపడ శాఖాగ్రంథాలయంలో వివిధ పోటీల్లో విజేతలకు సర్పంచ్ పిలక రవికుమార్, ఎస్‌ఐ కె.రమేశ్ దేవ్, ఆయుర్వేద వైద్యుడు అనిల్‌కుమార్, సచివాలయ కార్యదర్శి జోగారావు బహుమతులను అందజేశారు. సత్యసాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి ఎ.పోలయ్య, సహాయకుడు ఎస్.ప్రసాద్ మిఠాయిలు పంపిణీ చేశారు.



ఆందోళన చేస్తున్న స్థానికులు

సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపాలి

స్థానికుల ఆందోళన

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రం శ్రీవెంకటేశ్వర కాలనీకి ఆనుకుని 6వ వార్డులో డబ్ల్యుఎంఇ చర్చి ఆవరణలో ఎయిర్ టెల్ సంస్థ ఎటువంటి పంచాయతీ అనుమతులు లేకుండా స్థలం యజమానితో ఒప్పందం కుదుర్చుకుని గురువారం నిర్మాణం చేయడానికి పూనుకుంటున్న సమయంలో కాలనీవాసులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి హానికరమైన సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జనావాసాల మధ్య సెల్‌టవర్ నిర్మించడం వల్ల పెద్దలతో పాటు చిన్న పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. అధిక రేడియేషన్, కేన్సర్ ప్రమాదం, తలనొప్పి, నిద్ర సమస్యలు, జన్యుపరమైన నష్టాలు, జ్ఞాపకశక్తి లోపాలు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ ప్రాంతంలో సెల్‌టవర్ నిర్మాణానికి ఒప్పుకోవడం జరగదన్నారు. ఆందోళనలతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులకు, కలెక్టర్‌కు ఈసమస్యపై ఫిర్యాదులు అందించడం జరుగుతుందన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఇంటింటికీ తాగునీరు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని రణస్థలం పంచాయతీలో జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగునీరు అందించే లక్ష్యంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చేస్తామని స్పష్టం చేసారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, స్థానిక సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు, డిజిఎం ఆనందరావు, పిసిని జగన్నాథం నాయుడు, బెండు మల్లేశ్వరరావు, మజ్జి వెంకటరమణ, కెల్ల హేమంత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి కాలువలో చెత్త తొలగింపు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కర్లెమ్మ పంచాయతీ నేతాజీ నగర్ కాలనీలో రహదారి అనుకొని ఉన్న హడ్డుబంగి గెడ్డ పిల్ల కాలువలో స్థానికులు చెత్తా చెదారాలు వేసేయడంతో నిండిపోయింది. దీంతో సాగునీరు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ఈ ఏడాది రైతులు అవస్థలు పడ్డాడు. అలాగే వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో ఇబ్బందులు పడ్డారు. దీనిని ఎంపిడిఒ నీరజ స్పందించి నిధులు మంజూరు చేశారు. సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్‌నాయుడు పారిశుధ్య కార్మికులతో గురువారం కాలువలోని చెత్తా చెదారాలను తొలగించారు. దుకాణదారులు చెత్తను కాలువలో వేస్తే చర్యలు తప్పవని ఎంపిడిఒ హెచ్చరించారు.

ఆన్‌లైన్‌లోనే ఇంటి పన్నుల చెల్లింపు

ప్రజాశక్తి- పొందూరు

ఆన్‌లైన్‌లోని స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఇంటి పన్నులను నేరుగా చెల్లించాలని డిఎల్‌పి గోపీబాల అన్నారు. స్థానిక మేజర్‌పంచాయతీని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ 2025 - 26 ఆర్థిక సంవత్సరం నుంచి ఇంటి పన్నులను మాన్యువల్‌గా కాకుండా స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో లేదా పంచాయతీ కార్యాలయంలోనే చెల్లించాలన్నారు. ఇంటి పన్నులకు సంబంధించి నోటీసులు, రశీదులు ఇవ్వడం ఉండదని పేర్కొన్నారు. ఇంటిపన్నులు చెల్లింపులో పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకు వచ్చిందన్నారు. మండలంలో మొత్తం 21,036 ఇళ్లకు గాను పాత బకాయిలు, ఈ సంవత్సరం కలుపుకుని రూ.1,16,38,000 ఇంటి పన్నులు రూపంలో రావాల్సి ఉండగా ఇప్పటివరకూ రూ.6,52,000 వసూలైందని తెలిపారు. ప్రజలందరూ సకాలంలో ఇంటి పన్నులను చెల్లించాలన్నారు. ఈయనతో డిప్యూటీ ఎంపిడిఒ పి.సింహాచలం, ఇఒ కె.మోహన్‌బాబు ఉన్నారు.

బహిరంగ మలవిసర్జన చేయరాదు



మాట్లాడుతున్న డిఎల్‌పిఒ గోపీబాల

బహిరంగ మలవిసర్జన చేయరాదని, దీనిని అరికట్టడం ప్రతిఒక్కరి బాధ్యతని డిఎల్‌పిఒ అన్నారు. మంలంలోని లైదాం, కొంచాడలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లైదాం కాలనీలో బహిరంగ మలవిసర్జనపై స్థానిక మహిళలతో మాట్లాడారు. ఆరుబయట మలవిసర్జన వలన ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. బహిరంగ మలవిసర్జనను అరికట్టకపోతే చర్యలు తప్పవని హెచ్చ రించారు. అనంతరం గ్రామాల్లో చెత్తసంపద తయారీ కేంద్రాల నిర్వాహణ తీరును పరిశీలించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో సర్పంచ్ గొర్లె అనంతరామకృష్ణ, కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, జయరాం, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' అమలు చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, కాంగ్రెస్ కిసాన్ జిల్లా నాయకులు ఆబోధుల వెంకటనాయుడు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రణస్థలంలో రైతు సంఘం కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలు ముందు కౌలు రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం రెండు విడతలుగా రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ విడుదల చేసి వాస్తవ సాగుదారులైన కౌలు రైతులను విస్మరించడం అన్యాయమని అన్నారు. జిల్లాలో దాదాపు లక్ష మంది కౌలు రైతులు ఉంటే... జిల్లా యంత్రాంగం ఇచ్చిన రికార్డులు ప్రకారం ఏడు వేలుగా పేర్కొన్నారని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం గుర్తించిన ఈ తక్కువ మందికి కూడా అన్నదాత సుఖీభవ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కౌలు రైతులకు న్యాయం చేస్తామని, సులభంగా కార్డులు పొందే విధంగా చట్టం మారుస్తామని అసెంబ్లీలో ప్రకటించారని గుర్తు చేశారు. ఈ చట్టం మార్పు తీసుకురాకపోవడంలో అలసత్వం వహిస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వానికి కౌలు రైతులపై శ్రద్ధ లేదని పవన్ కళ్యాణ్ విమర్శించి కూటమి ప్రభుత్వంలో కూడా కౌలు రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేలు కౌలు రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా అన్ని విధాలుగా నష్టపోతున్న కౌలు రైతులకు న్యాయం చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు అమలు చేసేలా కౌలు రైతులందరూ పోరాడాలని పిలుపునిచ్చారు.

తారు రోడ్డు పనులు ప్రారంభం

వజ్రపుకొత్తూరు: కూటమి ప్రభుత్వం హయంలో గ్రామీణ రహదారులు అభివృద్ధి చేస్తున్నామని సుంకర జగన్నాథపురం సర్పంచ్ గాడి అఖిల్ అన్నారు. మండలంలోని పూండి నౌపడ ఆర్ అండ్ బి రహదారి నుంచి ఉద్దనం రాయపాడు వరకు నూతనంగా నిర్మించిన తారు రోడ్డు పనులను టిడిపి నాయకులతో గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో సుమారు రూ.85 లక్షల అంచనా వ్యయంతో బిటి రహదారి నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సరైన రహదారి సౌకర్యాలు లేని గ్రామాలకు కూటమి ప్రభుత్వం హయంలో మోక్షం లభించిందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుర్రి నారాయణస్వామి, ఉప్పాడ సత్యం, అట్టాడ రఘు, పిఎసిఎస్ డైరెక్టర్ కొత్తూరు అప్పారావు, మండల ఇంజినీర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

రేషన్ వితరణ



సరుకులను అందజేస్తున్న రాజేష్

ఇచ్ఛాపురం: మండలంలో హరిపురం పంచాయతీ బొడ్డకాలిలో ఇటీవల సంభవించిన మొంథా తుపాను ప్రభావానికి నిరుపేద కుటుంబానికి చెందిన పులి సోమయ్య పెంకుటిల్లు గోడ కూలిపోయింది. దీంతో కుటుంబకులు రోదిస్తున్న సందర్భంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు దుర్గాసి నిలవేణిరెడ్డి ద్వారా సమాచారం తెలుసుకున్న జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లొల్ల రాజేష్ తుపాను బాధిత కుటుంబానికి గురువారం పరామర్శించారు. రూ.5 వేలు ఆర్థికసాయంతో పాటు నిత్యవసర సరుకులు అందించారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు చీకటి కృష్ణయ్య, మున్సిపాలిటీ ఇన్‌ఛార్జి రోకళ్ల భాస్కరరావు, సోంపేట మండల నాయకులు పెద్దింటి రవీంద్ర వర్ధన్, జన సైనికులు లండ శ్రీనివాస్‌రెడ్డి, బుద్దాల అశోక్, చక్రవర్తి, అప్పన్నరెడ్డి, లండ చిన్నయ్యరెడ్డి, పుల్లి శివ, ప్రకాష్, దక్కత టింకు, పడాని పరుశురాం, దేవరాజు, కొత్తపల్లి బలరాం, వాసు, రంగాల విక్కి, రత్నాల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

నౌపడ గ్రామ శివారులో గురువారం ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం అనుమానాస్పద స్థితిలో లభ్యమైంది. నౌపడ మూడు రోడ్ల కూడలి దారి, కచీరు ఫారం ప్రాంతంలో స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న నౌపడ ఎస్ఐ నారాయణస్వామి వివరాల ప్రకారం, మహిళ తలపై కర్రతో గాని, మరేదైనా ఘాటు ఆయుధంతో గాని దాడి చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. టెక్కలి డిఎస్‌పి డి.లక్ష్మణరావు, టెక్కలి రూరల్ సిఐ కె.శ్రీనివాసరావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ సంఘటనా స్థలంలో సాక్ష్యాలను సేకరించింది. మహిళ తలపై, నుదుటిపై, నోరు, గడ్డం భాగాల్లో తీవ్రమైన గాయాలు ఉన్నట్లు గుర్తించారు. మృతురాలి కుడిచేతిపై ఓం గుర్తుల పచ్చబొట్లు ఉండటంతో ఆమెను గుర్తించడంలో ఇవి కీలకంగా ఉపయోగపడతాయని పోలీసులు తెలిపారు. మృతదేహం దగ్గర ద్విచక్ర వాహనం అచ్చులు కనిపించాయి. అక్కడి నుంచి దాదాపు 10 మీటర్ల దూరం వరకు ఈడ్చినట్లు కనిపి ంచిన ఆనవాళ్లు ఉన్నాయని వెల్లడించారు. మహిళను అక్కడికే తీసుకువచ్చి హత్య చేశారా? లేక ఇతర ప్రాంతంలో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ పడేశారా? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలి వివరాలు గుర్తుపట్టలేని పరిస్థితిలో ఉండటంతో ఆమె ఆచూకీ కోసం విచార ణను ముమ్మరం చేసినట్లు నౌపడ పోలీసులు తెలిపారు. ప్రశాంతంగా ఉన్న నౌపడలో ఈ ఘటన కలకలం రేపుతోంది.



తాళ్లతో కట్టేసిన స్థానికులు

గుర్తు తెలియని వ్యక్తుల హల్‌చల్

ప్రజాశక్తి- పలాస

పూండి-పలాస వచ్చే ఆర్‌టిసి బస్సులో మొత్తం ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తుల ముఠా హల్‌చల్ సృష్టించారు. కృష్ణారావు అనే ప్రయాణికుడిపై దాడికి దిగడంతో ఆయన ప్రాణభయంతో కండక్టర్ ఉన్న సీటు వద్దకు చేరుకున్నాడు. అనంతరం కాశీబుగ్గ సమీపిస్తున్న సమయంలో కత్తితో దాడి చేసి గాయపరిచి ఆయన ఫ్యాంట్ పాకెట్లో ఉన్న రూ.20 వేలు నగదు దొంగిలించారు. అనంతరం పారి పోయేందుకు యత్నిస్తుండగా కేకలు వేశారు. వెంటనే బస్టాండులో ఉన్న ఆటో కార్మికులంతా కలిసి దొంగలను పట్టుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరు పరారీ కాగా, మరో ముగ్గురు పట్టుబడ్డారు. వీరిని దేహశుద్ధి చేసి తాళ్లతో బంధించారు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు అప్పగించారు. వీరు విజయవాడ నుంచి బుధవారం వచ్చినట్లు వారి వద్ద రైలు టిక్కెట్లు లభ్యమయ్యాయి. అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణారావు కాశీబుగ్గలో ఆస్పత్రిలో చేరేందుకు పూండి రోడ్డులో బస్సు ఎక్కాడు. అందులో అనుమానాస్పదస్థితితో ఐదుగురు యువకులు కనిపించారు. బస్సు ఎక్కిన నుంచి కృష్ణారావుపై దాడి చేయడానికి యత్నించారు. ఆయన తప్పించకోవాలని ప్రయత్ని స్తున్నా వెంబడించినట్లు బాధితుడు తెలిపారు. అనతరం దాడి చేసి ఆస్పత్రి ఖర్చులకు తెచ్చుకున్న నగదుతో ఐదుగురు ఉండాయించడానికి ప్రయత్నించారు. అనంతరం వారిలో ముగ్గురు పట్టుబడగా, ఇద్దరు పరారీలో ఉన్నారు. ఎస్ఐ నర్సింహమూర్తిని వివరణ కోరగా ముగ్గురు అనుమానితులను ప్రశ్నిస్తున్నామని తెలిపారు. వీరిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

ఇచ్ఛాపురం : సత్యసాయి శత జయంతి సందర్భంగా ప్రభుత్వాసత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవేంద్రరెడ్డి, డాక్టర్ నీలిమ, వైద్య సిబ్బంది, సత్య సాయి సేవా సమితి సభ్యులు పండ్లు పంపిణీ చేశారు.

నిర్లక్ష్యపు మొక్కలు



ఇనుప స్టాండ్‌లో ఏర్పాటు చేసిన మొక్కలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సమీపంలో 80 రోడ్ల కూడలి వద్ద ఇనుప స్టాండ్‌ల్లో సుడా ఆధ్వర్యంలో మొక్కలు ఏర్పాటు చేశారు. రథసప్తమి వేడుకలు రాష్ట్ర పండగగా నిర్వహించారు. ఈ పండగ నేపధ్యంలో స్టాండ్‌లో మొక్కలు ఏర్పాటు చేశారు. ఆహ్లాదం, పచ్చదనం లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ మొక్కలు ఎండి పోతున్నాయి. కొన్ని చచ్చిపోయాయి. వీటికి నీరు సరఫరా కోసం ట్యాంకులు ఏర్పాటు చేసి, మోటార్, స్ప్రిక్లర్ పైపులు ద్వారా డ్రిప్ సిస్టం ఏర్పాటు చేశారు. మోటార్



పనిచేయని డ్రిప్ వ్యవస్థ



ఎండిన మొక్కలు

మరమ్మత్తయితే సుడా అధికారులు స్పందించటం లేదు. లక్షలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన స్టాండుల్లో మొక్కలు ఎండి పోతున్నాయి. దీంతో ఆశయం మసకబారి పోతుంది. అధికారులు స్పందించి మొక్కలకు సకాలంలో నీరు పెట్టాలని, పచ్చదనం కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

మార్గంమధ్యలో నిలిచిన బస్సు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని తాళ్లవలస సమీపంలోని జాతీయ రహదారిపై పెద్దగెడ్డ సమీపంలో గురువారం విశాఖపట్నం డిపోకు చెందిన ఆర్‌టిసి నాన్‌స్టాప్ బస్సు నిలిచిపోయింది. 50 మందికిపైగా ప్రయాణికులతో విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వస్తుండగా ఉదయం 8 గంటల సమయంలో ఒక్కసారిగా జాతీయ రహదారిపై మరమ్మతులకు గురై నిలిచిపోవడంతో డ్రైవర్ అజయ్‌ప్రసాద్ విశ్వప్రయత్నం చేసినప్పటికీ బాగవ్వక పోవడంతో మరోవైపు ప్రయాణికులు తమతమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు, కార్యాలయాలకు వెళ్లేవారు, ఇతర అత్యవసర పనులపై వెళ్లే వారు సమయానికి వెళ్లలేమని ఆవేదన చెందారు. ఆర్‌టిసి అధికారులు బస్సులు కండీషన్ ముందే సరిచూసుకొని ప్రయాణికులను ఎక్కించాలని డ్రైవర్‌ను నిలదీశారు. దీంతో డ్రైవర్ కొన్ని బస్సులను అపి ప్రయాణికులను పంపించారు. బస్సు మధ్యహ్నం 3 గంటల వరకు మరమ్మతులు పూర్తవ్వ లేదు. దీంతో కండీషన్ లేని బస్సులను ఎలా నడుపుతారని, ముందే చూసుకుని ఉండాలని, అధికారులు పట్టించుకకపోతే ఎలా అని ప్రయాణికులు, ప్రజలు ఆవేదన చెందారు.



మరమ్మతులకు గురై నిలిచిపోయిన బస్సు


మాట్లాడుతున్న ఎంఇఒ-2 విశ్వనాథం

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రానున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలని ఎంఇఒలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథ్ తెలిపారు. విద్యాశాఖ కార్యాలయంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల అకడమిక్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 22న నిర్వహించనున్న స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ, పదో తరగతి ఆన్‌లైన్‌లో నామినల్ రోల్ సబ్మిట్ చేసే విధానం గురించి వివరించారు. పదో తరగతి వంద రోజులు ప్లాన్, స్టడీ అవర్స్ నిర్వహణ, సి,డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు నిర్వహణ చేయాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు.

పీర్లోత్సవానికి పోటెత్తిన యాత్రికులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలోని పీర్ల కొండపై ఏటా మార్గశిర మాసంలో గురువారం నిర్వహించిన పీర్లోత్సవానికి భారీగా యాత్రికులు తరలివచ్చారు. మతసామరస్యాలకు ప్రతీకగా నిలుస్తున్న ఈ ఉత్సవం ఇచ్ఛాపురంతో పాటు సమీప గ్రామాలు, తెలంగాణ, చెన్నయ్, ఒడిశా రాష్ట్రాలు నుంచి యాత్రికులు తరలి వచ్చారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న పీర్ల కొండపై ఉన్న దర్గాకి వెళ్లడం అనవాయితీగా వస్తుంది. వేలాది మంది యాత్రికులు తరలిరావడంతో సిఐ మీసాల చిన్నంనాయడు ఆధ్వర్యాన టౌన్ ఎస్ఐ ముకుందరావు పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పేరుకు ముస్లిం దర్గా అయినా పూజ విధానంలో మాత్రం కొబ్బరికాయ కొట్టడం విశేషం. హిందూ, ముస్లిములు సోదర భావాలతో కలిసి మెలసి చేసుకునే ఈ పీర్లోత్సవం మతసామరస్యానికి ప్రతీకిగా నిలుస్తుంది.

ఆరుతడి పంటలతో అధిక లాభాలు

పలాస: ఆరుతడి పంటలతో అధిక లాభాలు ఉంటాయని జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ సిహెచ్.వెంకటరావు అన్నారు. మండలంలోని కైజలా, మహదేవపురం గ్రామాల్లో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస యోజన, ఆత్మ పథకం కింద గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి, మినుములు, పెసర, మొక్కజొన్న, వేరుశెనగ పంటల్లో అధిక దిగుబడులు సాధించడానికి, మేలైన యాజమాన్య పద్ధతలు గురించి అవగహన కల్పించారు. పెసర, మినుముల్లో వేపానూనె, 19-19-19, క్లోరోఫైరీ పోస్ మందులు వాడితే అధిక దిగుబడులు వచ్చునని తెలిపారు. అలాగే మొక్కజొన్నలో ఎరువులు యాజమాన్యం, కలుపు యాజమాన్యం, కత్తెరపురుగు యాజమాన్య పద్ధతలు గురించి వివరించారు. కార్యక్రమంలో రాగోలు శాస్త్రవేత్త శ్రీనివాసరావు, ఎఒ పోలాకి, శేఖర్, ప్రవళ్లిక పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

మెళియాపుట్టి: టిడిపి కార్యకర్తలకు అండగా నిలుస్తూ, వారి కుటుంబాల సంక్షేమంపై మరోసారి టిడిపి తన బాధ్యతను చాటుకుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని ముక్తాపురం పంచాయతీకి చెందిన గుమ్మడి యోగేశ్వరరావు ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు టిడిపి కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును దేవికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, ఎఎంసి చైర్మన్ ప్రతినిధి బైరిసింగి దినకర్, చాపర మాధవరావు, చాపర మాధవరావు, ధర్మాన రమేష్, కృష్ణారావు పాల్గొన్నారు.

సాగర్ కవచ్

వజ్రపుకొత్తూరు: సముద్ర మార్గం గుండా ఉగ్రవాదుల కదలికలను గుర్తించేందుకే ఏటా సాగర్ కవచ్ నిర్వహిస్తున్నట్లు కాశీబుగ్గ రూరల్ సిఐ ఎం.తిరుపతి తెలిపారు. మండలంలో 80 మంది పోలీసులతో దేవునల్తాడ, పూండి, బెండి, బెండిగేటు, వజ్రపుకొత్తూరు తదితర చోట్ల గురువారం గస్తీ నిర్వహించారు. సముద్ర మార్గం ద్వారా ఉగ్రవాదులు ప్రవేశిస్తే ఎలా గుర్తించాలో స్థానికులు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. అపరిచితులు తారసపడితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తీర ప్రాంత మత్స్యకారులకు, ప్రజలను కోరారు.

ఆకట్టుకున్న అన్వేష్ ప్రసంగం

ఇచ్ఛాపురం: గుంటూరు కృపమినిస్ట్రీస్ ఆవరణంలో ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రత్తి అన్వేష్ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ప్రెసిడెంట్ బిషప్ రెబ్బ ఇమ్మనీయేల్, స్టేట్ ప్రెసిడెంట్ కె.ప్రభాకరరావు, ఫౌండర్ సెక్రటరీ రెవ డాక్టర్ పి.జీవన్ కుమార్, అడ్వైయిజర్ అడిషనల్ డిజిపి కుంచోడి బాబూరావు, జాయింట్ సెక్రటరీ జెమ్స్, వి.కె.కుంపట్ల, ఆల్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శభాష్.. చిన్నారులు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని కుసుంపురం ఎంపిపిఎస్ విద్యార్థులు జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. కాశీబుగ్గలోని సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యాన గురువారం జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 70 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో కుసుంపురం ఎంపిపిఎస్ విద్యార్థులు తృతీయ స్థానం కైవసం చేసుకుని స్థానికుల ప్రశంసలు అందుకున్నారు. వీరికి తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు.

కొత్త వంగడాలతో మెరుగైన దిగుబడులు

కవిటి: మండలంలోని జగతి, పుటియాదల రైతులకు అందించిన కొత్త వంగడాలు ఆర్‌జిఎల్ 7034, ఆర్‌జిఎల్ 7039 రకాలతో మెరుగైన ఫలితాలు వచ్చినట్టు సోంపేట ఎడిఎ భవానీశంకర్, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఉదయ్ బాబు, మధుకుమార్, శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఉదయం జగతి, పుటియాదల రైతుల పొలాలు పరిశీలించిన వీరు సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో వేసిన ఆర్‌జిఎల్, మిగతా పంటల కంటే ఇవి నాణ్యతలో మెరుగైనవిగా గుర్తించిన వీరు దిగుబడిలో కూడా మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నట్టు తెలిపారు. రాబోయే కాలంలో మిగతా రైతులు కూడా వీటిపై ఆకస్తి ఆసక్తి చూపిస్తారని వీరు అన్నారు. ఈ పరిశోధనలో పరిశీలనలో ఎఒ శ్రీదేవి, ఎఇఒ కళ్యాణ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- నరసన్నపేట


లత, ప్రిన్సిపాల్

నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధిపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.లత తెలిపారు. ఈ మేరకు కళాశాలలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ప్రధానమంత్రి కౌశిక్ వికాస్ యోజన పథకంలో భాగంగా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఉచిత ప్రవేశానికి ఈ నెల 29 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. ఇందులో సిసి టివి ఫుటేజ్ సూపర్ వైజర్, కష్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, ఎంఎస్ ఆఫీస్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టెక్కలి : టెక్కిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్లో ఉపాధి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనలో స్వల్పకాలిక కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 29 వరకు దరఖాస్తులు అందజేయవచ్చునని తెలిపారు.. సిసి టివి సూపర్‌వైజర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కంప్యూటర్ కోర్సులకు సంబంధించిన అంశాలపై ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు.

18 నుంచి 30 ఏళ్లలోపు వయసు ఉన్న యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు కళాశాలలో కో-ఆర్డినేటర్ పి.రమేష్‌ను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

33/11 కెవి రాగోలు, అలికాం, వాకలవలస సెక్షన్ పరిధిలో గల 11కెవి, కొత్తరోడ్డు, తోటాడ, రాగోలు టౌన్, వాకలవలస, పొన్నాం ఫీడర్ల పరిధిలో గల చెట్టుకొమ్మలు తొలగించడానికి, మరమతులు కొరకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలం పరిధిలో గల పొన్నాం, చల్లపేట, వెంకటాపురం, గొల్లపేట, బామ్మిడివానిపేట, కరిమిల్లిపేట, రోణంకి, రామకృష్ణాపురం, రాగోలు, కొత్తరోడ్డు, బావాజీపేట, గూడెం, చంద్రయ్యపు పేట, రామన్నపేట, తొటాడ, అక్కివరం, దూసి, వాకలవలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజీనీర్ ఆపరేషన్ పైడి యోగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పొందూరు: మండలంలోని తాడివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎఇ సుధీర్ పేర్కొన్నారు. విద్యుత్‌లైన్‌లకు అడ్డుగా ఉన్న చెట్లు కొమ్మలను తొలగించడంతో పాటు సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, మరమ్మతులు నేపథ్యంలో తాడివలస, గోరింట, వాల్తేర్, లిఫ్ట్ ఇరిగేషన్ ఫీడర్స్ పరిధిలో గల తాడివలస, బెలమాం, జగన్నాథపేట, లొద్దలపేట, గోకర్ణపల్లి, కావలి, వాల్తేరు, గోరింట, లైదాం, సిరిపురం, యాగాటిపేట, లొట్టపేట, సిరిపురం తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునన్నారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహక రించాలని కోరారు.

నరసన్నపేట: నరసన్నపేట టౌన్ 11 కెవి ఫీడర్‌పై ఉన్న గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎఇ రామ్ చరణ్ గుప్త తెలిపారు. గురువారం ఎఇ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ మర మ్మతులు పనులు నిమిత్తం తామరాపల్లి, జమ్ము, జమ్ము కూడలి, జిల్లెడిమాకివలస, జడూరు, సెయింట్ క్లారిటీ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తు న్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెలుగు సిబ్బంది

ఘనంగా దత్తత మాసోత్సవాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సృష్టిలో మహిళలకు మాతత్వం ఒక వరం, దత్తత మరో మార్గమని జిల్లా బాలల రక్షణ విభాగానికి చెందిన సోషల్ వర్కర్ డి.మధురమీనాక్షి అన్నారు. ఇచ్ఛాపురంలోని మండల మహిళా సమాఖ్య సమావేశానికి హాజరై జాతీయ దత్తత మాసోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమాజంలో వివిధ కారణాల వల్ల పుట్టిన పిల్లలను రహదారులపై, చెత్త దిబ్బల దగ్గర, ప్రమాదకర ప్రదేశాల్లో పడేయడానికి ఎవరికీ హక్కు లేదన్నారు. అలా కాకుండా సమీప ఆరోగ్య కేంద్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఉయ్యాల'లో పిల్లలను సురక్షితంగా ఉంచాలని తెలిపారు. అనధికార దత్తత వల్ల కలిగే నష్టాలు, ఫోస్టర్ కేర్, ఆఫ్టర్ కేర్ గురించి కూడా వివరించారు. 'అవాంఛిత గర్భం దాల్చి పిల్లలను కనిన తల్లులు తమ పేర్లు గోప్యంగా ఉంచుతూ, పిల్లలను బాలల రక్షణ గృహాలకు చట్టబద్ధంగా అప్పగించవచ్చు' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిఎం గోవింద్, సిసిలు పాల్గొన్నారు.

మాణిక్యపురం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కవిటి

క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శనతో మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు. పాఠశాల నుంచి అండర్-14 (ఎస్‌జిఎఫ్) సాఫ్ట్‌బాల్ బాలుర, బాలికల విభాగంలో 5 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు మజ్జి వైకుంఠరావు తెలిపారు. ఈ నెల 22,24 తేదీల్లో కడప జిల్లా పులివెందులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాఠశాల నుంచి సుజిత్ర జన్ని (7వ), సమీరా సాహు (9వ), శివం సాహు (8వ), మర్రిపాటి హర్ష వర్ధన్ (8వ), డొక్కరి నాని (8వ) పాల్గొంటారని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు మజ్జి వైకుంఠరావు మాట్లాడుతూ తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించాలని అభిలాష వ్యక్తం చేశారు. అంతేకాకుండా విద్యార్థుల ప్రతిభకు పదునుపెట్టిన వ్యాయామ ఉపాధ్యాయులు రవికుమార్ మహంతి, ఎం.తోటారావు సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది


అభినందిస్తున్న హెచ్‌ఎం హేమకుమారి

విజేతలకు అభినందనలు

ఇచ్ఛాపురం: రాష్ట్రస్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు జి.హేమకుమారి తెలిపారు. ఈ మేరకు గురువారం విజేతలను అభినందించారు. ఇటీవల శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల వేదికగా నిర్వహించిన బాల బాలికల ఖోఖో ఎంపిక పోటీలో బాలికల విభాగంలో డి.మీన, బి.ధనలక్ష్మి, బాలురు విభాగంలో డి.రవి, బి.దేవరాజు, బి.నవీన్, డి.జస్వంత్‌లు ప్రతిభ కనబరిచారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె.జానకిరావు, ఉపాధ్యాయులు సిహెచ్.వెంకటరమణ, గోవిందరావు, శ్రీహరి, కృష్ణారావు, పద్మావతి, సువర్ణ, సేసాశ్రీ, గంగవేణి, ఈశ్వరరావు, రాఘవేంద్ర, వెంటేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- నరసన్నపేట

పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటుతూ, పద్మావతి డిగ్రీ కళాశాల నేషనల్ సర్వీస్ స్కీమ్ విభాగం ఆధ్వర్యాన గురువారం మొక్కల పెంపకంతో పర్యావరణ రక్షణ అనే నినాదంతో భారీస్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మొక్కలు కేవలం పచ్చదనాన్ని మాత్రమే కాక, స్వచ్ఛమైన గాలిని అందించి, మానవ మనుగడకు అత్యంత అవసరమైన ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తాయన్నారు. స్థానిక ప్రభుతాస్పత్రి ఆవరణలో కళాశాల పరిసర ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ శాంతికుమారి పాణిగ్రాహి, ఎన్ఎస్ఎస్ పిఒ కె.రాము, వాలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న శాంతికుమారి పాణిగ్రహి

ఆపదలో ఆదుకునేందుకే సహాయనిధి

ప్రజాశక్తి- కవిటి


కవిటి : చెక్కు అందిస్తున్న విప్ అశోక్

బడుగు, బలహీన వర్గాలను ఆపదలో ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి తోడ్పడుతుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. నియోజకవర్గంలోని పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను విప్ అశోక్ గురువారం అందించారు. కవిటి మండలం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 19 మందికి రూ.14,07,503ల విలువైన చెక్కులు అందించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచిలి : మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడు కుటుంబాలకు వైద్య ఖర్చుల కోసం మొత్తం రూ.5,00,418 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ప్రభుత్వ విప్ అశోక్ అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మాదిన రామారావు పాల్గొన్నారు.

నరసన్నపేట : స్థానిక రోడ్ల, భవనాల గెస్ట్ హౌస్‌లో 47 మంది లబ్ధిదారులకు రూ.25,17,677 చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షులు ఎం.వెంకట అప్పలనాయుడు, బైరి భాస్కరరావు, లావేటి కృష్ణ పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు

దుక్కి లేకుండా మొక్కజొన్న సాగు

ప్రజాశక్తి- లావేరు/సరుబుజ్జిలి

ఖరీఫ్ వరి సాగు అనంతరం రైతులకు తక్కువ పెట్టుబడితో మొక్కజొన్న సాగు దుక్కి లేకుండా చేపట్టవచ్చునని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ తవిటి నాయుడు తెలిపారు. గురువారం మండలంలోని చిగురువలసలో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తవిటినాయుడు మాట్లాడుతూ డబుల్ వీల్ మార్కర్ ఉపయోగించి మొక్కజొన్న విత్తనాలు వేయటం ద్వారా రైతులకు ఎకరాకు సుమారు రూ.5 వేలు వరకు ఖర్చు తగ్గుతుందని తెలిపారు. అంతే కాకుండా ఈ విధంగా విత్తనాలు వేయడం వలన సాగునీటి వినియోగం కూడా రెండు తడులు నీటిని ఆదా చేయడం జరుగుతుందని వివరించారు. రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సరుబుజ్జిలి, ఎల్ఎన్ పేట మండలాల్లో సుమారు 1500 ఎకరాల్లో ఈ ఏడాది సాగు చేయనున్న మొక్కజొన్న రైతులకు విత్తనాలు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు అత్తులూరి లావణ్య, పాతిన శ్రీనివాస్, శివ్వాల కుమారి, రైతులు పాల్గొన్నారు.

నూతన వరి వంగడాల క్షేత్రం పరిశీలన

సోంపేట : నూతన వరి వంగడాలను సాగు చేయడంలో స్థానిక రైతులు శ్రద్ధ చూపుతున్నారని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ కాలానికి క్షేత్ర స్థాయి అనుకూలత పరిశీలన కోసం మొత్తం 5 రకాల నూతన వరి విత్తన చిరు సంచులను రైతులకు రాగోలు వరి పరిశోధనా కేంద్రం అధికారులు అందించారు. బారువ పరిధిలో ఆర్‌జిఎల్ 7039 చిరు సంచి ప్రదర్శన వరుసగా రెండో సంవత్సరం పరిశీలన రైతు తెప్పల శ్రీనివాసరావు క్షేత్రంలో నిర్వహించారు. కోతకు వచ్చిన సమయంలో పరిశోధనా స్థానాలకు చెందిన డాక్టర్ కె.మధుకుమార్, డాక్టర్ ఎం.ఉదయ్‌కుమార్ గురువారం వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవనీ శంకరరావు, మండల వ్యవసాయాధికారి బి.నరసింహమూర్తితో కలసి క్షేత్ర పరిశీలన చేశారు. ఈ రకం రానున్న ఏడాది కూడా క్షేత్ర పరిశీలన చేసి, విడుదల కోసం సిఫార్సు చేయనున్నామని శాస్త్రవేత్తలు తెలిపారు. తాము ప్రస్తుతం సాగు చేస్తున్న శ్రీకాకుళం సన్నలు, ఇంద్ర, అమర, స్వర్ణ, సాంబమసూరి కంటే దిగుబడి, నాణ్యత విషయంలో చూడడానికి మెరుగ్గా ఉందని ప్రదర్శనకు హాజరైన రైతులు అభిప్రాయ పడ్డారు.


పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రాయితీపై అపరాలు

ప్రజాశక్తి- లావేరు

రైతులకు అందుబాటులో పెసర, మినుము, రాగులు విత్తనాలు 50 శాతం రాయితీపై రైతులకు అందించేందుకు లావేరు రైతుసేవా కేంద్రంలో సిద్ధంగా ఉన్నాయని లావేరు విఎఎ పి.సుమాంకా తెలిపారు. రాగులు ఇంద్రావతి, చైతన్య రకం రెండుకిలోల ప్యాకెట్ రూ.69, పెసలు ఐపిఎం 2-14 రకం నాలుగు కిలోల ప్యాకెట్ రూ.378, మినుములు ఐపిఎం 2-43 రకం నాలుగు కిలోల ప్యాకెట్ రూ.386 చొప్పున కావాల్సిన రైతులు ఆధార్, పాస్ పుస్తకం, ఒన్ బి తీసుకొని రైతు సేవా కేంద్రానికి రావాలని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

20 మంది రక్తదానం

పలాస : స్థానిక ఎస్‌బిఎస్‌వైఎం డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ టి.ప్రవీణ్ కుమారి అధ్యక్షతన కాలేజీ ఆవరణలో 77వ వార్షికోత్సవ సందర్భంగా గురువారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదానంలో ఎన్‌సిసి క్యాడెట్స్ 20 మంది 20 పాల్గొనిన్నారు. రక్తదాతలకు ప్రిన్సిపాల్ అభినందిస్తూ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సిసి కేర్ టేకర్ వంకల రాజు, ఉమెన్ కేర్ టేకర్ పి.జయమ్మ పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట మండల పరిషత్ కార్యాలయంలో చేపడుతున్న నిర్మాణ పనులను ఎంపిపి నిమ్మా దాసు గురువారం పరిశీలించారు. అనంతరం మండలంలో నిర్వహించిన ఉపాధి పనులను, ఎం.బుక్స్‌లను రికార్డ్స్ చేసి, పనుల చేసిన కాంట్రాక్టర్లకు తొందరగా క్లియరెన్స్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయనతోపాటు ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, జెఇ రమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ పండా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

నరసన్నపేట: నరసన్నపేట పట్టణంలోని ఇందిరానగర్ ప్రాంతంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న అపార్‌మెంట్ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బిల్డింగ్స్ సొసైటీ అధ్యక్షులు చింతు రామారావు కోరారు. ఈ మేరకు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిల్డింగ్ సొసైటీ నియమాలకతీతంగా నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. పంచాయతీ బిల్డింగ్స్ సొసైటీ ఎన్‌ఒసి లేకుండా గృహేతర ఉపయోగాలకు నిర్మాణాలకు ఒప్పందం చేసుకోవడం బిల్డింగ్ సొసైటీ నియమాలు ఉల్లంఘిస్తూ చేపడుతున్న పనులను తక్షణమే నిలిపివేయాలన్నారు.


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

ఎమ్మెల్యే ఎన్ఇఆర్ పరామర్శ

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రానికి చెందిన వారణాసి రాంప్రసాద్‌కు ఇటీవల ప్రమాదవశాత్తు కాలు ఫ్యాక్చర్ అయింది. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు స్థానిక టిడిపి నాయకులు డిజిఎం ఆనందరావు, పిషిని జగన్నాథం నాయుడు, బెండు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'మాతృమూర్తి' సేవలు భేష్

ప్రజాశక్తి- కవిటి

ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న మండలంలోని కుసురంపురం కేంద్రంగా పనిచేస్తున్న మాతృమూర్తి యువజన సంఘం సేవలు అభినందనీయమని సర్పంచ్ బద్రి ప్రకాష్ అన్నారు. కిడ్నీ వ్యాధితో తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న బిజిపుట్టుగకు చెందిన చరణ్, అనన్యలకు మాతృమూర్తి యువజన సేవా సంఘం అండగా నిలిచింది. చరణ్, అనన్యల దయనీయ స్థితి తెలుసుకున్న మాతృమూర్తి సభ్యులు గురువారం గ్రామానికి చేరుకుని స్థానిక సర్పంచ్ చేతులు మీదుగా రూ.8 వేలు అందించారు. కార్యక్రమంలో బొడ్డ జగదీష్, అంగ సురేష్, భాస్కర్, సర్వేశ్, ఆశీష్ తదితరులు పాల్గొన్నారు.

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరి

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలోని ప్రతిపౌరుడూ గ్రామ/వార్డు సచివాలయాల్లో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరిగా చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నుంచి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదై ఇప్పటి వరకు ఏ కారణం చేత వారి ఆథరైజేషన్ ఇవ్వనివారు కచ్చితంగా సిటిజెన్ ఇకెవైసి చేసుకోవాలన్నారు. దీనికి సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించాలన్నారు.